జగనన్న సురక్షతో అర్హులందరికీ న్యాయం



మడకశిర రూరల్: మెళవాయిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



పెనుకొండ: మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



హిందూపురం టౌన్: మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక తదితరులు

• ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హులందరికీ న్యాయం చేయడానికే జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని మెళవాయి, ఛత్రం గ్రామ సచివాలయాల వద్ద శుక్రవారం జగనన్న సురక్ష క్యాంపులు జరిగాయి. మెళవాయి జగనన్న సురక్ష సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయితీలోని గ్రామాల్లో ఇంక అర్హత ఉండి ఏదైనా కారణాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు లబ్ధి పొందని వారికి వందశాతం న్యాయం చేస్తామని తెలిపారు. పేదల సంక్షేమం పట్ల ఇంత ప్రేమ చూపిస్తోన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకోవాలన్నారు. అదాయ, జనన, మరణ, కుల తదితర 11 రకాల సర్టిఫికెట్లను పైసా ఖర్చు లేకుండా ఉచితంగా లబ్ధిదారులకు అందిస్తామన్నారు. ఆనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. సర్పంచ్ రంగనాథ్, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్,ఎంపీటీసీ గంగరత్నమ్మ, తహసీల్దార్ ముర్షావలి, ఎంపీడీఓ సోనిబాయి, ఈఓఆర్డీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ న్యాయం

• ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: జగనన్న సురక్షతో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చనున్నట్లు ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మారుతీనగర్ సమీపంలోని 5వ వార్డు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాల్లో వంద శాతం న్యాయం జరగాలన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరికీ ధ్రువీకరణ పత్రాలను జగనన్న సురక్షా పథకం ద్వారా అందించే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇప్పటికే ఈ పథకం ద్వారా వేలాది మందికి కుల, ఆధాయ, జనన, మరణ తదితర ధ్రువీకరణ పత్రాలు అందాయన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజలను మోసం చేసారని, మళ్లీ కల్లిబొల్లి కబుర్లు చెబుతూ ప్రజలను మోసపుచ్చడానికి వస్తున్నారని, ప్రజలు ఆయన మాటలను నమ్మరాదన్నారు. జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి సాధించి ప్రజలకు కలకాలం సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ పారూక్‌ఖాన్, వైస్ చైర్మన్లు సునీల్, నందిని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరుబాబు టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వరం.. జగనన్న సురక్ష

హిందూపురం టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దరి చేర్చాలన్న సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక అన్నారు. శుక్రవారం పట్టణంలోని 14, 17, 18, 19, 20, 22, 23, 28వ వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించగా ఆమెతోపాటు మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ హసీనా సుల్తానా హాజరయ్యారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వెంటనే రఖాస్తుదారులకు అధికారుల చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలుఅందజేస్తున్నామన్నారు. అనంతరం ఆయా వార్డుల్లో 4631 ధృవీకరణ పత్రాలను దరఖాస్తుదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, కౌన్సిలర్లు షాజియా, ఆసిఫ్, శివ, గిరీష్, జయప్ప, మల్లికార్జున గౌడ్, రామచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, నాయకులు నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, లక్ష్మీనారాయణ, రామ్మూర్తి, సాధిక్, డాక్టర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: ప్రతి అర్హుడికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దమంతూరులో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యాక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతచారి, ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సర్పంచ్ అశ్వర్థమ్మ, ఎంపీటీసీ నాగమ్మ, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

• శభాష్.. వలంటీర్!



ఆనంతపురం ఆసుపత్రిలో బాబన్నకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చెన్నప్ప (ఫైల్)

వలంటీర్లకు వందనం

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు చెన్నప్ప. లేపాక్షి మండలం కల్లూరు గ్రామంలో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. తన సచివాలయ పరిధిలో ఇంటిపై నుంచి కింద పడి నడుము విరిగిన బాబాన్న అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందుతున్నాడు. గత సంవత్సరం డిసెంబర్ 28న ఆసుపత్రిలో అడ్మిషన్ పొందాడు. ఖర్చులకు కూడా లేక ఇబ్బందులు పడుతున్నాడు. బెడ్ మీద నుంచి లేవలేని పరిస్థితి. విషయం తెలుసుకున్న వలంటీర్ చెన్నప్ప అనంతపురంలోని ఆస్పత్రికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశాడు. అలాగే ఇంటింటికీ వెళ్లి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు.

–లేపాక్షి:

ఆపదలో ఆదుకున్నాడు

నేను ప్రమాదవశాత్తు ఇంటి మీద నుంచి కిందపడ్డాను. ఉన్న ఒక్క కుమారుడు కూడా నాతోనే ఉంటూ మందులు, మాత్రలు ఇస్తున్నాడు. నా భార్య కూడా అనారోగ్యంతో ఇల్లు దాటి రాలేని పరిస్థితి. అలాంటి ఆపద సమయంలో వలంటీర్ చెన్నప్ప ఆదుకున్నాడు. రెండు నెలలు పాటు ఆస్పత్రికి వచ్చి సొమ్ము అందజేశాడు.



బాబన్న, కల్లూరు, లేపాక్షి మండలం

క్లుప్తంగా

తల్లిదండ్రులు సమయం కేటాయించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ-2 రవిచంద్రకుమార్

గుడిబండ: విద్యార్థుల చదువు కోసం తల్లిదండ్రులు సమయం కేటాయించాలని ఎంఈఓ-2 రవిచంద్రకుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పిల్లలు ఎలా చదువుతున్నారో, ఏం చదువుతున్నారో రోజూ తల్లిదండ్రులు పరిశీలించాలన్నారు. పీసీ చైర్మన్ కె.శివకుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

లారీ బోల్తా



గుట్టను ఢీకొన్న లారీ

పెనుకొండ రూరల్: పెనుకొండ నుంచి పావగడ వెళ్లే రహదారిలో రైల్వే వంతెన సమీపంలో లారీ అదుపుతప్పి బోల్తాపడింది. వివరాలు.. గురువారం రాత్రి పావగడ నుంచి కొబ్బరి బోండాల లోడుతో పెనుకొండ వైపు వెళ్తున్న లారీ రొద్దం పేట్లు దిగే క్రమంలో రెండో టర్నింగ్ వద్ద అదుపుతప్పి ఎదురుగా ఉన్న గుట్టను ఢీకొనింది. దీంతో లారీ ముందుభాగం పాక్షికంగా దెబ్బతినింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదని తెలిపారు.

శాకంబరి దేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



హిందూపురం టౌన్: వాసవీ కన్యకాపరమేశ్వరి శాకంబరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని అష్టలక్ష్మీ ఆలయంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

అమరాపురం: మండల కేంద్రంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్యులు శుక్రవారం ఆషాఢ మాసం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు హరీష్‌భట్టాచార్యులు అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన చేపట్టారు. సాయంత్రం భక్తులు తెచ్చిన వివిధ పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మంటపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహన్ని ఉంచి మహిళా భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు.

రైతుకు తీవ్ర గాయాలు

మడకశిరరూరల్: దిన్నెమీదపాళ్యం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన రైతు రంగారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. రైతు ఉదయం బైక్‌పై డెయిరీకి పాలు వేసేందుకు వెళ్తుండగా టిప్పర్ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు బెంగళూరుకు తరలించారు.

జగనన్న సంక్షేమ పాలనకే ప్రజల మద్దతు



మరువపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందిస్తుండంతో ప్రజలు జగనన్న పాలనకు సంపూర్ణ మద్దతు పలుకుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మరువపల్లి, దిగువ అచ్చంపల్లి గ్రామాల్లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. సీఎం జగనన్న పరిపాలనలో తమకు ఎంతో మేలు జరిగిందని లబ్ధిదారులు వివరించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం ఖాయమని ఆయన విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ప్రజలకు ఎలాంటి సేవలు అవసరమో వారి ఇళ్ల వద్దకు వలంటీర్లను పంపి తెలుసుకొని వాటిని అందిస్తున్నారని తెలిపారు. గ్రామంలో ప్రజలు తెలియజేసిన ప్రధాన సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటేనే సక్రమంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. వైఎస్ జగన్ పరిపాలనలో వలంటీర్ల, సచివాలయ వ్యవస్థ ద్వారా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, డైరెక్టర్లు బీఎల్ రామకృష్ణ, నాగరాజుగౌడు, సర్పంచులు ప్రభావతి బాయి, గీత, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, సింగల్ విండో అధ్యక్షుడు రామిరెడ్డి, మాజీ ఎంపీపీ బజ్జప్ప, వైస్ ఎంపీపీలు శ్రీరామరెడ్డి, ఎస్ఎన్ మూర్తి, ఎంపీటీసీ భాగ్యాబాయి, ఎస్సీ, బీసీ సెల్ నాయకులు జమ్మానిపల్లి మూర్తి, మంజునాథ్, రంగనాథ్, శివప్ప, సత్యనారాయణ, దివాకర్, శేషాద్రి, గోపాల్ నాయక్, నారాయణస్వామి, తిమ్మరాయుడు, విజయ్ పాల్గొన్నారు.

పశు సంరక్షణకు ప్రభుత్వ తోడ్పాటు



గర్భకోశ వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారులు

పరిగి: పశు సంరక్షణకు ప్రభుత్వం తోడ్పాటు నందిస్తోందని, పాడి రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పెంచలయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా హిందూపురం డివిజన్ స్థాయి ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీడీ డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ పశువుల పాల దిగుబడికి మేలైన రకం పశుగ్రాసం పెట్టాలన్నారు. మంచి పోషక విలువలున్న గ్రాసం పండించేందుకు రైతులు ఆసక్తి కనబరచాలన్నారు. పశు వైద్యశాలలో వివిధ పశువులకు గర్భకోశ వ్యాధులపై పరీక్షలు చేశారు. అనంతరం మందులు అందించారు. కార్యక్రమంలో అనంతపురం పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ సుధాకర్, ఏడీ సోమనాథ్, వైద్యులు శివశంకర్‌నాయక్, సుబ్బరాయుడు, గీతావాణి, రాధిక, వీఎల్వో దాదాఖలందర్, జేవీఓ అశ్వర్థ, సీఎస్‌పి మూర్తి, సిబ్బందితో పాటు పాడి రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగులను నియమించండి

పావగడ: తిరుమణి సోలార్ పార్క్ ప్లాంట్ల లో ఖాళీగా ఉన్న స్థానాలలో ఉద్యోగులను నియమంచాలని స్థానిక శక్తి స్థల రైతుల క్షేమాభివృద్ధి సంఘం పదాధికారులు శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్పి సాంబసదాశివరెడ్డి మాట్లాడుతూ తిరుమణి, వళ్లూరు గ్రామ పంచాయతీల పరిధిలో 10 వేల ఎకరాల్లో ఏర్పాటైన సోలార్ పార్క్ లో 40 ప్లాంట్లు ఉండగా ప్రతి ప్లాంటు సుమారు 250 ఎకరాల్లో నిర్మించారన్నారు. అయితే ప్రతి ప్లాంటు లోనూ 15 మంది సెక్యూరిటీ గార్డులు, 5 మంది సాంకేతిక సలహాదారులు నియమించాల్సి ఉందని అయితే కొన్ని ప్లాంట్ల లో తక్కువ సంఖ్యలో ఉద్యోగస్థులు ఉండడంతో పని భారం ఎక్కువైందన్నారు. వెంటనే ఈ నెల 30 లోగా మిగిలిన ఉద్యోగులను నియమించాలని లేని పక్షంలో శక్తి స్థల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు సోలార్ కంపెని అధికారికి వినతి పత్రం అందించారు. సంఘం ఉపాధ్యక్షుడు కేఎం శ్రీనివాసులు, ట్రెజరర్ కేఎస్ మారుతి ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

కోడిపల్లి కట్టపై కంపచెట్ల తొలగింపు

లేపాక్షి: మండలంలోని కోడిపల్లి చెరువు కట్టపై కంపచెట్లను వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ఉదయం తొలగించారు. కంపచెట్లు పెరగడంతో కోడిపల్లి నుంచి చోళసముద్రం ఉన్నత పాఠశాలకు వెళ్లడానికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ, సర్పంచ్, పార్టీ మండల కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక చొరవతో కంపచెట్లను తొలగించారు. అలాగే కోడిపల్లి శ్మశాన వాటికలో కూడా కంపచెట్లు తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజునాథ్, పీసీ కమిటీ చైర్మన్ అశ్వత్తనారాయణ, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ దేవాలయం వద్ద అన్నదానం

లేపాక్షి: మండలంలోని గొంగటిపల్లి ముత్యాలమ్మ దేవాయం వద్ద శుక్రవారం గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా కురువాలని, పంటలు బాగా పండి, ప్రజలు సుభిక్షంగా ఉండాలని భక్తులు అమ్మ వారిని ప్రార్థించారు. అలాగే మండలంలోని మామిడిమాకులపల్లి ఎస్సీ కాలనీలో సుంకలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

అమరాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో ఆదివారం ఉదయం 10 గంటల ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆరోగ్యమైత్రి కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు తెలిపారు. స్త్రీ వ్యాధుల నిపుణులు జ్యోతివిజయ్‌కుమార్, కంటి నిపుణులు జింకా కృష్ణమోహన్ సేవలందిస్తారన్నారు.

'డంపింగ్ యార్డును తరలించండి'

హిందూపురం టౌన్: స్థానిక అహమ్మద్ నగర్‌లో ఉర్దూ పాఠశాలకు ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డును తరలించాలని ప్రజా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. శుక్రవారం డంపింగ్ యార్డును పరిశీలించి విద్యార్థులు, స్థానికులతో సమస్యను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన వెదజల్లుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా ఆకతాయిలు యార్డుకు నిప్పు పెట్టడంతో వచ్చే దట్టమైన పొగ ఈ ప్రాంతం మొత్తం అలుముకుంటుండడంతో వృద్ధులు, పిల్లలు శ్వాస కోశ వ్యాధులతో బాధపడాల్సి వస్తోందన్నారు. మున్సిపల్ కమిషనర్, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు చైతన్య, గంగిరెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, పర్యావరణ వేత్త భాస్కర్‌రెడ్డి, ముస్లిం నగారా ఉమర్ ఫరూఖ్, డాక్టర్ వెంకటరమణ, స్థానికులు సాధిక్, సనావుల్లా, కార్మిక నాయకుడు రవి కుమార్, గోపాలకృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

మహిళా డ్రైవర్‌కు ఘన సన్మానం



డ్రైవర్ నందినిని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా లోని దొమ్మతమరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛ మిషన్ వాహన మహిళా డ్రైవర్ నందినిని స్థానిక హెల్ప్ సొసైటీ పదాధికారులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల సాక్షి దినపత్రిక లో 'శభాష్ నందిని' అనే శీర్షిక తో వెలువడిన వార్త కు స్పందనగా దొమ్మతమరి లోని గ్రామ పంచాయతీ కార్యాలయానికి హెల్ప్ సొసైటీ పదాధికారులు స్వయంగా వెళ్లి డ్రైవర్ నందిని తదితర పారిశుద్య కార్మికులను సన్మానించారు. హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశి కిరణ్, పీడీఓ రంగధామ, వెంకటేశ్ మూర్తి, గ్రామ పంచాయతీ సభ్యుడు వెంకట నాయుడు, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్‌మేళాకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల కోసం నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాబ్ మేళాలను నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. జాబ్‌మేళాలో 12 కంపెనీలు పాల్గొన్నాయి. జెడ్పీటీసీ శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్లు సునీల్, నందిని, ఎంపీపీ గీత, ముఖ్య నాయకులు రామ్మోహన్‌రెడ్డి, కన్వీనర్‌లు బోయ నరసింహ, నాగలూరు బాబు, కౌన్సిలర్లు, అధ్యాపకులు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు నిరుద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలు అధికారుల దృష్టికి..

హిందూపురం టౌన్: వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి పలు సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం తహసీల్దార్ హసీనాసుల్తానాను కలిసి సమస్యలపై చర్చించారు. చౌళూరు మధుమతి రెడ్డి 'మమేమం' కార్యక్రమం ద్వారా మండల వ్యాప్తంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అందులో రెవెన్యూ సమస్యలను అర్జీల రూపంలో తహసీల్దార్‌కు అందజేశారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలందరికీ న్యాయం చేస్తుందన్నారు. అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, చంద్ర, గోపాల్, సుబ్బిరెడ్డి, మజీద్, అనిల్‌రెడ్డి, తిమ్మారెడ్డి, వాసు పాల్గొన్నారు.

రోడ్డు వేయించండి

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రోడ్డు వేయించాలని డిగ్రీ విద్యార్థులు ఎమ్మెల్యే శంకరనారాయణను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు వినతిపత్రం అందించారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ

హిందూపురం టౌన్: వారధి చారిటబుల్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వీడీ రోడ్డు సమీపంలోని చిన్మయ పాఠశాలలో విద్యార్థులకు రూ.25 వేల విలువ జేసీ పుస్తకాలను శుక్రవారం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు నిమ్మకాయల రాము, డీఆర్‌జీ శ్రీకాంత్, మంజునాథ్, చంద్ర, పవన్, చరణ్, విజయ్, మహేష్, విశ్వహిందూ పరిషత్ నాగరాజు, ప్రధానోపాధ్యాయురాలు ఉషశ్రీ, రూపలేఖ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ వృత్తి విద్యాకోర్సు బోధించడానికి అర్హుల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నటుల ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్ శుక్రవారం తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ 50 శాతం ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఈనెల 18న కళాశాలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

వైద్య సిబ్బంది సన్మానం

రొళ్ల: స్థానిక సీహెచ్‌సీలో డాక్టర్ దివాకర్, హెల్త్ సూపర్ వైజర్ ఓబుళమ్మ, ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్లు అనిత, కిరణ్‌కుమార్, జనరల్ ల్యాబ్ టెక్నీషియన్ అశోక్‌రెడ్డి, స్టాఫ్‌నర్సులు లలిత, పద్మజ, మాలతి, లక్ష్మీ, విజయనిర్మల, షభాను, ఎఫ్ఎన్ఓ సరోజమ్మ ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. శుక్రవారం వారిని సీహెచ్‌సీలో ఘనంగా సన్మానించారు.

రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

చిలమత్తూరు: రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టినట్టు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని మరవకొత్తపల్లి లో ఉన్న ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లకు ఆయన రేడియం స్టిక్కర్లకు అతికించారు అనంతరం డ్రైవర్లతో సమావేశాన్ని నిర్వహించి ప్రతి ఒక్కరూ రహదారి నియమాలను తప్పక పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు విజయ్‌కుమార్, రమేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత

రొద్దం: మండలంలోని నారనాగేపల్లికి చెందిన సత్యనారాయణరెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మృతుడి భార్యకు రూ.10 వేలు అందించినట్లు పంచాయతీ కార్యదర్శి శివమూర్తి శుక్రవారం తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ నరసింహులు, డిజిటల్ అసిస్టెంట్ దేవరాజ్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆవు లక్ష్మినారాయణరెడ్డి, వలంటీర్ విశోక్, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పరిగి: మండలంలోని పీ నరసాపురం పంచాయతీలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీడీఓ సరస్వతి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హాజరవుతారన్నారు. నరసాపురంతో పాటు కొత్తపల్లి గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరవుతారన్నారు. పి.నరసాపురంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ సర్టిఫికెట్లను ఆయన చేతుల మీదుగా అందిస్తారన్నారు.

మడకశిరరూరల్: చందకచెర్లు గ్రామ సచివాలయం పరిధిలోని భీమరాయనపల్లి, కొత్తలం గ్రామాల్లో శనివారం ఉదయం 7.30 గంటల నుంచి ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ప్రభావతిబాయి, ఎంపీపీ కవిత తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

నేడు 'జగనన్న సురక్ష'

చిలమత్తూరు: మండలంలోని మరవకొత్తపల్లి ఆర్బీకే వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు..

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం సచివాలయం ఆవరణలో శనివారం ఉదయం 9 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహానాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని కురుబవాండ్లపల్లిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివశంకరప్ప ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



గౌతమ్‌రెడ్డి

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి పాసైన విద్యార్థి గౌతమ్‌రెడ్డి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. జెడ్పీ స్కూల్‌లో పదో తరగతిలో నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో 600 మార్కులకు గానూ 570 మార్కులు గౌతమ్‌రెడ్డి సాధించాడు. ట్రిపుల్ ఐటీ సీటే లక్ష్యంగా తన ప్రతిభతో పరీక్ష రాశాడు. వచ్చిన మార్కుల అర్హత ఆధారంగా ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు జెడ్పీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్ తెలిపారు. దీంతో తల్లిదండ్రులు గోవిందరెడ్డి, రాజేశ్వరీ తన కుమారుడు చూపిన ప్రతిభతో హర్షం వ్యక్తం చేశారు.

డెంగీ నివారణపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సమీవుల్లా ఖాన్

అగళి: మండల కేంద్రంలో శుక్రవారం మలేరియా సబ్ యునిట్ అధికారి సమీవుల్లా ఖాన్ ఆధ్వర్యంలో డెంగీ, మలేరియా నివారణ కార్యక్రమం చేపట్టారు. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మలేరియా సబ్ యునిట్ అధికారి తెలియజేశారు. హెల్త్ అసిస్టెంట్ సుందరయ్య, సూపర్‌వైజర్ జయమ్మ పాల్గొన్నారు.